thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 150 | జగిత్యాల గురువారం 03 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

తెలిపోనున్న రోహిత్ భవితవ్యం




11

## ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోండి!



- హైకమాండ్ ఎదుటే కొండా సురేఖ సంచలన సవాల్
- నాపై చర్యలకంటే ముందు సీఎం వ్యవహారంపై విచారణ చేయాలి
- 'పదేళ్లు నేనే సీఎం' అని ఎలా చెబుతారు?
- రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా?

2

## రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం

2





# 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో రక్షణ ఎక్స్‌పో

## ప్రారంభించాలంటూ రాజ్‌నాథ్‌కు రేవంత్ ఆహ్వానం

- డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్
- ఎయిర్‌షోకు సూర్యకిరణ్, సారంగ్ బృందాలను కోరిన సీఎం
- త్రివిధ దళాల అత్యాధునిక వ్యవస్థల ప్రదర్శనకు విజ్ఞప్తి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు హాజరుకావాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే 'రక్షణ ఎక్స్‌పో-2026'ను ప్రారంభించాలని కోరారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సును నిర్వహించనున్నట్లు వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రాజ్‌నాథ్‌సింగ్‌తో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ

మిగతా 2 లో

## విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి

కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సీఎం రేవంత్ భేటీ

2



## మరో పదిమంది నకిలీ వైద్యులు

వివిధ ప్రాంతాల్లో దాడి చేసి పట్టుకున్న పోలీసులు

2



## రంగంలోకి మిలిటరీ ఇంటెలిజెన్స్

- ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కలకలం
- 12 ఆయుధాలు.. 1,912 తూటాలు మాయం
- 'ఇంటి దొంగల' ప్రమేయంపైనా అనుమానం
- సీసీ కెమెరాలో అనుమానాస్పద బైక్
- పలువురు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

2



## కూకట్‌పల్లిలో భూముల ధరలకు రెక్కలు

- గజానికి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయం

3



## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

3

కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు

కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు
- ఇరాక్, జోర్డాన్ వైపు ఇరాన్ క్షిపణులు
- కువైట్, బహ్రెయిన్‌లోనూ పేలుళ్ల కలకలం
- 13 క్షిపణులను కూల్చేశామన్న జోర్డాన్
- అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక

4

## అంతుచిక్కని ప్రకృతి విలయం

- 1127కి చేరిన వరద మృతుల సంఖ్య



.. వివరాలు 4లో

## వెయ్యి రోజుల పాలన.. దగా పాలన!

- అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం: కేటీఆర్
- మేనిఫెస్టోనే శతాబ్దపు అతిపెద్ద మోసమని విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ.. ఉద్యోగాలు.. పెన్షన్లలో మోసమేనని ధ్వజం
- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చార్జ్‌షీట్ విడుదల


3




## 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

- పునర్వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో
- 30 వేలకు పడిపోనున్న ఉద్యోగుల సంఖ్య

4





# మరో పదిమంది నకిలీ వైద్యుల పట్టివేత

## వివిధ ప్రాంతాల్లో దాడి చేసి పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరి కొందరు నకిలీ డాక్టర్లను పట్టుకున్నారు. అర్హత లేకపోయినా డాక్టర్ల అవతారమెత్తి క్లినిక్‌లు నడుపుతున్న 10 మంది ఫేక్ డాక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ మెరుపు దాడుల వివరాలను కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి వెల్లడించారు. మేడ్చల్ - మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో నకిలీ క్లినిక్‌ల దందా విచ్చలవిడిగా సాగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. పేట్ బషీరాబాద్, మేడ్చల్, జగద్గిరిగుట్ట, సూరారం, పటాన్ చెరు, ఆర్‌సీ పురం తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో దాడులు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 నకిలీ క్లినిక్‌లను సీజ్ చేశారు. కేవలం టెన్త్, ఇంటర్, బీకామ్ వంటి చదువులు మాత్రమే చదివిన ఈ కేటుగాళ్లు, ఎలాంటి కనీస మెడికల్ నాలెడ్జ్ లేదా గుర్తింపు పొందిన డిగ్రీలు లేకుండానే క్లినిక్‌లు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారని విచారణలో తేలింది. ఎలాంటి అర్హత లేకున్నా క్లినిక్‌లలో ఏకంగా బెడ్లు ఏర్పాటు చేసి, అమాయక రోగులకు, చిన్నపిల్లలకు సైతం వైద్యం అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో వచ్చే పేషెంట్లకు ఎడాపెడా సెలైన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తూ ప్రాణాలపైకి తెస్తున్నారని పోలీసులు తెలిపారు. దాడుల సమయంలో ఈ క్లినిక్‌ల నుంచి పెద్ద ఎత్తున బీపీ మిషన్లు, స్టెతస్కోప్‌లు, గ్లూకోజ్ టెస్టింగ్ మిషన్లు, సిరంజీలతో పాటు భారీగా గడువు తీరిన ఔషధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి మాట్లాడుతూ.. నకిలీ డాక్టర్ల వల్ల రోగుల ప్రాణాలకు తీవ్రమైన ముప్పు ఉందన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చికిత్స కోసం వెళ్లే ముందు సదరు వైద్యులకు సరైన మెడికల్ సర్టిఫికేషన్లు, అర్హతలు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలాంటి అర్హత లేని వ్యక్తులు క్లినిక్‌లు నడుపుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రంగంలోకి దిగిన మిలిటరీ ఇంటిలిజెన్స్

## ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** సికింద్రాబాద్ బొల్లారం ప్రాంతంలోని 20 మద్రాస్ ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఆర్మీ అంతర్గత విచారణతో పాటు హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. తాజాగా కేంద్ర మిలటరీ ఇంటెలిజెన్స్ కూడా రంగంలోకి దిగింది. ఆయుధాల చోరీ వెనుక బయటి వ్యక్తులతో పాటు లోపలి వ్యక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ సాగుతోంది. ఆగస్టు 30 రాత్రి నుంచి 31వ తేదీ తెల్లవారుజాము మధ్య చోరీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆర్మరీలోని ఆయుధాల పెట్టెల తాళాలు పగులగొట్టి ఒక ఇన్సాస్ రైఫిల్, నాలుగు ఏకే-47లు, ఆరు పిస్టళ్లు సహా మొత్తం 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. వీటితో పాటు 21 మ్యాగజైన్లు, 1,912 రౌండ్ల తూటాలు, నైట్ విజన్ బైనాక్యులర్ కూడా చోరీకి గురైనట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన భద్రత ఉండే సైనిక స్థావరంలోకి ప్రవేశించి ఆయుధాగారాన్ని గుర్తించడం, తాళాలు పగులగొట్టి ఇంత పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తరలించడం సాధారణ దొంగలకు సాధ్యం కాదని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఇది 'ఇంటి దొంగల' పనే అయి ఉండొచ్చన్న కోణంలో మల్కాజిగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సెక్యూరిటీ ప్లాన్, ఆయుధాల నిల్వ ప్రాంతాలపై అవగాహన ఉన్న వ్యక్తుల సహకారం ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మిల్కా సింగ్ గ్రౌండ్ సమీపంలోని కెమెరాల్లో తెల్లవారుజామున 3.48 గంటలకు ఓ అనుమానాస్పద బైక్ కనిపించినట్లు సమాచారం. ఆ బైక్‌కు చోరీతో సంబంధం ఉందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రెజిమెంట్ ప్రహరీ సమీపంలో ఓ మ్యాగజైన్ కూడా లభించింది. ఇప్పటికే సుమారు 12 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సిబ్బంది ప్రమేయం, సంఘవిద్రోహ శక్తుల కుట్ర తదితర కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ఆయుధాల రికవరీతో పాటు భద్రతా వైఫల్యాలపై ఆర్మీ అధికారులు విచారణ జరుపుతున్నారు.

# వెయ్యిరోజుల అభివృద్ధిపై చర్చకు రండి

## బిఆర్‌ఎస్‌కు మంత్రి అడ్లూరి సవాల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు సంబంధించి బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి లిస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు వాట్సాప్‌లో పంపిస్తున్నట్లు చెప్పారు. ఛార్జ్‌షీట్ కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌లో అబద్దాలు మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను హరీశ్ రావు, కేటీఆర్, కేసీఆర్‌కు రిపోర్ట్ పంపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు కూడా ఇస్తున్నామని చెప్పారు. 'మాకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. అప్పుడే కేటీఆర్‌కు తొందర ఎందుకు' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 2014-18 మ్యానిఫెస్టో, కాంగ్రెస్ 2023 మ్యానిఫెస్టోపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. 'మీ పదేళ్ల పాలన, మా రెండున్నరేళ్ల పాలనపై దమ్ముంటే చర్చకు రండి' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు.

# 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో రక్షణ ఎక్స్‌పో

మొదటి పేజీ తరువాయి

ఎక్స్‌పో నిర్వహణతో పాటు తెలంగాణలో రక్షణ రంగానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సులతో పాటు భారీ ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం వివరించారు. ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, అంకుర సంస్థలు, యువ శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని కోరారు. ఎయిర్‌షోకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళ విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ విన్యాస బృందాలు పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విమానాల స్థిర ప్రదర్శన ఏర్పాటుకూ సహకరించాలని కోరారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఎక్స్‌పోలో ప్రదర్శించాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు సదస్సులో భాగస్వాములు కావాలని సీఎం కోరారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు డీఆర్‌డీవో ప్రయోగశాలలు విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించేలా సహకరించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ ప్రతినిధులు, ద్వైపాక్షిక ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాల ఏర్పాటుకూ కేంద్రం సహకారం



కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ చేపట్టినట్లు రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం వివరించారు. రక్షణ శాఖ మొత్తం 1,500 ఎకరాలు కోరిన నేపథ్యంలో మరో 750 ఎకరాలను సేకరించి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాలు కేటాయించేందుకు టీజీఐఐసీ ఇప్పటికే అంగీకరించిందని వివరించారు. మొత్తం భూమికి ఏడాదికి రూ.1 నామమాత్రపు లీజుతో 33 సంవత్సరాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే మరో రెండుసార్లు లీజును పొడిగించుకునే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:** తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.ఆదిలాబాద్‌లో రన్ వే ఫైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే



నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోండి!

## హైకమాండ్ ఎదుటే సురేఖ సంచలన సవాల్

## నాపై చర్యలకంటే ముందు సీఎం వ్యవహారంపై విచారణ చేయాలి

## 'పదేళ్లు నేనే సీఎం' అని ఎలా చెబుతారు?

## రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపైనా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రిపై నేరుగా విమర్శలు చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తానే పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని బహిరంగంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లోని పలువురు మంత్రులపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయని, అయితే తన విషయంలో మాత్రమే చర్యల మాట ఎందుకు వస్తోందని నిలదీశారు. ముఖ్యమంత్రిపై మంత్రులు, పార్టీ నేతల్లోనూ అసంతృప్తి ఉందని వ్యాఖ్యానించారు. తనను ఇప్పటివరకు రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని, పార్టీ అధిష్ఠానానికి అన్ని విషయాలను రాతపూర్వకంగా వివరించినట్లు తెలిపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను ఎందుకు బాధ్యురాలిని చేస్తున్నారని ప్రశ్నించారు. ఇతర సామాజిక వర్గాలకు చెందిన పలువురు నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. "రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా?" అంటూ కొండా సురేఖ ప్రశ్నించారు. తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రినని, తన విషయంలో మాత్రం కఠిన చర్యలపై చర్చ జరుగుతుండటం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు, పార్టీ పెద్దలందరికీ తన వాదనను లిఖితపూర్వకంగా వివరించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని కూడా అధిష్ఠానం సమగ్రంగా పరిశీలించాలని ఖర్గేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కొండా సురేఖ తాజా వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఢిల్లీలో రాజీ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో కొండా సురేఖపై చర్యలకు సంబంధించి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్ఠానానికి నివేదిక పంపినట్లు సమాచారం. అధిష్ఠానం నిర్ణయంపై తాను వేచి చూస్తున్నానని, పార్టీ తీసుకునే నిర్ణయాన్ని గమనిస్తానని సురేఖ తెలిపారు. అయితే తనపై మాత్రమే చర్యలు తీసుకోవడం కంటే, పార్టీలోని అన్ని అంశాలను ఒకే ప్రమాణంతో పరిశీలించాలని ఆమె చేసిన డిమాండ్ ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

# రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

## మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం

**హైదరాబాద్,సెప్టెంబర్ 2:** తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది. తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు. మరోవైపు.. రాఖీ పౌర్ణమి



సందర్భంగా పలువురు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లారు. దీంతో రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకునే అవకాశం చాలామందికి లేకుండా పోయింది. చివరి రోజుల్లో రేషన్ షాపుల వద్ద రద్దీ కూడా పెరగడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ.. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మూడు నెలల బియ్యం కోటాను కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించింది. తాజాగా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో 3 నెలల బియ్యం కోటాను తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు తీసుకోని అర్హులైన కార్డుదారులు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత బియ్యం పంపిణీపై మరింత అవకాశం ఉండకపోవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఇంకా కోటా తీసుకోని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా సమీప రేషన్ దుకాణానికి వెళ్లి తమకు కేటాయించిన బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. 3 నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడం వల్ల ఏర్పడిన రద్దీ, పండుగ కారణంగా లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం గడువు పొడిగించడం రేషన్ కార్డుదారులకు ప్రయోజనకరంగా మారింది. దీంతో రేషన్ బియ్యం తీసుకోలేని వారికి మరో అవకాశం లభించింది.

చురకలు



# వెయ్యి రోజుల పాలన.. దగా పాలన!

- అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం: కేటీఆర్
- మేనిఫెస్టోనే శతాబ్దపు అతిపెద్ద మోసమని విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ.. ఉద్యోగాలు.. పెన్షన్లలో మోసమేనని ధ్వజం
- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల




**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ఇది వెయ్యి రోజుల ప్రజాపాలన కాదు.. పీడన పాలన. ఎటు చూసినా విధ్వంసం, వికృతమే కనిపిస్తోంది. జలద్రోహం చేస్తున్న జలగల పాలన ఇది" అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై రూపొందించిన ఛార్జ్‌షీట్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను "ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం"గా అభివర్ణించారు. ఆరు గ్యారంటీలు, వందలాది హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండానే ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప వెయ్యి రోజుల్లో సాధించింది ఏమీ లేదన్నారు. రైతులకు రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి అందులో కొంత మొత్తంతోనే సరిపెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి దేవుళ్లపై ప్రమాణాలు చేసినా పెద్ద సంఖ్యలో రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందలేదన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా తీర్చిదిద్దితే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. రైతుబంధు నిలిచిపోయిందని, యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రాజకీయ కక్షతో రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. ఇతర కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించేందుకు మాత్రం ముందుకు రావడం లేదని విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ నీటి హక్కులకు నష్టం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఎస్ఎల్‌బీసీ, చెక్‌డ్యామ్‌ల అంశాల్లో కేంద్ర సంస్థలు స్పందించడం లేదని విమర్శించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో తెలంగాణ ప్రాజెక్టుల ప్రయోజనాలను బలంగా వినిపించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ ఉద్యోగ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు తెలంగాణలో నిరుద్యోగుల ఆందోళనలను అణచివేస్తున్నారని ఆరోపించారు. పేదల భూములను నిషేధిత జాబితాల్లో చేర్చి వాటి పరిష్కారం పేరుతో కమీషన్లు తీసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోందని, రాష్ట్ర సంపద విషయంలోనే విభేదాలు బయటపడుతున్నాయని వ్యాఖ్యానించారు. "అసమర్థతలో ప్రో మ్యాక్స్.. అవినీతిలో అల్టిమేట్.. అరాచకంలో ఐమ్యాక్స్" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో అసలైన కాంగ్రెస్ లేదని, పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన నేతలను పక్కనపెట్టి మధ్యలో వచ్చిన వారికి పెద్దపీట వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ ప్రకటించింది. సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నిరసనలో మల్లారెడ్డి మాస్ స్టెప్పులు

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసనల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తనదైన శైలిలో సందడి చేశారు. యువకులతో కలిసి డ్యాన్స్ చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ హామీలపై విమర్శలు చేస్తూనే యువకులతో కలిసి మాస్ స్టెప్పులు వేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటూ తనదైన శైలిలో కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

# కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశాం

- రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉన్న అభివృద్ధి వైపుకు
- అప్పుల భారం ఉన్నప్పటికీ ముందుకు వెళుతున్నాం
- వెయ్యి రోజుల పాలన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్,సెప్టెంబర్ 2:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

# వైఎస్ ఆశయాలే మా లక్ష్యం

**ప్రాణహిత-చేవెళ్ల సహా ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

**రైతుల గుండెల్లో వైఎస్‌కు చెరగని స్థానం**

**రాహుల్‌ను ప్రధానిని చేయడమే నిజమైన నివాళి**

**ఢిల్లీలో వైఎస్ఆర్ అవార్డ్స్-2026లో సీఎం రేవంత్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** రైతుల సంక్షేమానికి జీవితాంతం కట్టుబడిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన గౌరవమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవార్డ్స్-2026' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే దస్త్రంపై వైఎస్ తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. తెలంగాణలో సాగునీటి అవసరాలను తీర్చేందుకు వైఎస్ హయాంలో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేయడమే ఆయన ఆశయాలకు నిజమైన గౌరవమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడాలన్నది వైఎస్ చివరి కోరిక అని రేవంత్ చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే వైఎస్‌కు అందించే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.





# కూకట్‌పల్లిలో భూముల ధరలకు రెక్కలు

**గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ వచ్చింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఈ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయించడం హాట్‌టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో భూముల ధరలు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ వేలం మరోసారి స్పష్టం చేసింది. అధికారులు నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఒక్కో గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, వేలంలో పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగా పెరిగాయి. అత్యధికంగా ఒక ఎ÷-లాట్ గజం రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. మరో ఎ÷-లాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయించారు. అదేవిధంగా మరో రెండు ప్లాట్లు గజం రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. వేలంలో మొత్తం 19 మంది బిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాట్ల కోసం పోటీపడ్డారు. ఈ పోటీ కారణంగా హౌసింగ్ బోర్డు నిర్దేశిరచిన కనీస ధర కంటే అనేక ప్లాట్లు అధిక ధరలకు విక్రయమయ్యాయి. మొత్తం 16 ఎ÷-లాట్ల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది. వేలంలో గజం సగటు ధర రూ.1.79 లక్షలుగా నమోదైంది. కేపీహెచ్‌బీ ప్లాట్లకు భారీ డిమాండ్ ఉన్నట్లు ఈ వేలం ద్వారా మరోసారి వెల్లడైందని అధికారులు చెప్పారు. హైదరాబాద్‌లో కీలకమైన ప్రాంతాల్లో అందుబాటులోని హౌసింగ్ బోర్డు భూములకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని హౌసింగ్ బోర్డు ఎ÷-లాట్లకు కూడా పోటీ నెలకొంటోందని అన్నారు. వేలం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు అధికారులు వెల్లడించారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయం హౌసింగ్ బోర్డు ఆర్థిక వనరులను పెంచడంలో కీలకంగా మారనుందని తెలిపారు. కేపీహెచ్‌బీ వైస్ ఛైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ ఎ÷-లాట్లకు భారీ డిమాండ్ ఉందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

**కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు**

**నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు**

**కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కుమ్ములాటలు కొత్తేమీ కావు..

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ అనేది ఒక విలక్షణమైన జాతీయ పార్టీ అని, పార్టీలో అభిప్రాయభేదాలు, అంతర్గత కొట్లాటలు ఉండటం సహజమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒకరికొకరి మధ్య విభిన్నమైన అభిప్రాయాలు ఉంటాయని అన్నారు. చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయని, అయితే ఆ చర్చలు లేదా వివాదాలు పరిమితులు దాటితే మాత్రం పార్టీ అధిష్ఠానం కచ్చితంగా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లను కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే పరిమితం చేయకుండా, అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చురకలు



## సంపాదకీయం



# కోచింగ్ సంస్కృతి.. విద్యకు ప్రత్యామ్నాయంగా మారుతోందా ?

పాఠశాలలో బోధన పూర్తికాకముందే మరో తరగతి మొదలవుతోంది. పాఠశాల తర్వాత కోచింగ్.. వారాంతాల్లో కోచింగ్.. సెలవుల్లోనూ కోచింగ్. వైద్య, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు, చివరకు కొన్ని పాఠశాల స్థాయి పరీక్షలకూ ప్రత్యేక శిక్షణ అవసరమనే భావన బలపడుతోంది. పాఠశాల విద్యపై నమ్మకం తగ్గి.. కోచింగ్‌పై ఆధారపడటం పెరుగుతున్నదా? అన్న ప్రశ్న ఇప్పుడు విద్యావ్యవస్థను ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన స్థాయికి తీసుకెళ్లింది.

కోచింగ్ అవసరమే కాదని చెప్పడం వాస్తవికం కాదు. పోటీ పరీక్షలకు ప్రత్యేకమైన పద్ధతులు, సమయ నిర్వహణ, ప్రశ్నల సాధన అవసరం కావచ్చు. సమస్య కోచింగ్ ఉండటంలో కాదు.. అది పాఠశాల విద్యకు అనుబంధంగా కాకుండా దానికి ప్రత్యామ్నాయంగా మారడంలో ఉంది.

ఇటీవల కేంద్ర ప్రభుత్వ కమిటీ కూడా ఇదే సమస్యను గుర్తించింది. పాఠశాల పాఠ్యప్రణాళికకు, జేఈఈ, నీట్ వంటి ప్రవేశ పరీక్షల ప్రశ్నల స్థాయికి మధ్య గణనీయమైన అంతరం ఉందని పేర్కొంది. ఈ వ్యత్యాసం కారణంగా పాఠశాలలో నేర్చుకున్న విద్య సరిపోదన్న భావన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పెరుగుతోంది.

దీని ఫలితమే కోచింగ్ కేంద్రాల విస్తరణ. రాజస్థాన్‌లోని కోటా దీనికి ప్రతీకగా మారింది. ఒకప్పుడు ఏటా 2–2.5 లక్షల మంది విద్యార్థులు అక్కడికి వచ్చేవారని పరిశ్రమ వర్గాలు చెబితే, 2024లో ఆ సంఖ్య సుమారు 85 వేల నుంచి లక్షకు పడిపోయింది. అదే సమయంలో కోచింగ్ పరిశ్రమ వార్షిక ఆదాయం సుమారు రూ.6,500–7,000 కోట్ల నుంచి రూ.3,500 కోట్లకు తగ్గినట్లు నివేదికలు తెలిపాయి. అంటే కోచింగ్ ఒక విద్యా సేవ మాత్రమే కాదు.. భారీ ఆర్థిక వ్యవస్థగా కూడా ఎదిగిందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

అయితే ఈ వ్యవస్థకు సామాజిక ధర ఎంత? కోటాలో 2023లో 26 మంది, 2024లో 16–17 మంది కోచింగ్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అధికా రిక/మీడియా నివేదికలు నమోదు చేశాయి. 2026లోనూ ఇటువంటి విషాద ఘటన లు కొనసాగుతున్నాయి. ఆగస్టు 2026లో వెలువడిన నివేదిక ప్రకారం కోటాలో ఆ ఏడాది ఇప్పటివరకు ఎనిమిదో కోచింగ్ విద్యార్థి ఆత్మహత్య కేసు నమోదైంది.

ఇక్కడ అసలు సమస్య విద్యార్థుల సామర్థ్యం కాదు.. విజయాన్ని ఒకే పరీక్ష, ఒకే ర్యాంకు, ఒకే వృత్తితో కొలిచే వ్యవస్థ. లక్షల మంది విద్యార్థులు వైద్య లేదా ఇంజినీరింగ్ సీట్ల కోసం పోటీపడుతుంటే, ప్రతి విద్యార్థికి "విఫలమైతే జీవితం ముగిసినట్టే" అనే మానసిక ఒత్తిడి ఏర్పడుతుంది. తల్లిదండ్రుల ఆర్థిక త్యాగం, విద్యార్థిపై ఆశలు, తోటి విద్యార్థులతో పోలిక——ఇవన్నీ కలిసి ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి.

కోచింగ్ రంగాన్ని నియంత్రించేందుకు కేంద్ర విద్యాశాఖ 2024లో మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిలో 16 ఏళ్లలోపు విద్యార్థులను కోచింగ్ కేంద్రాల్లో చేర్చకూడదన్న నిబంధన, అధిక ఫీజులపై నియంత్రణ, మానసిక ఆరోగ్యానికి కౌన్సెలర్లు–మనోవైద్య నిపుణుల సహాయం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, మౌలిక వసతుల ప్రమాణాలు, తప్పుడు విజయ ప్రకటనల నియంత్రణ వంటి అంశాలు ఉన్నాయి. రాష్ట్రాలు వీటిని చట్టపరమైన వ్యవస్థగా అమలు చేయాలని కేంద్రం సూచించింది.

కానీ నియంత్రణ ఒక్కటే పరిష్కారం కాదు. పాఠశాల విద్య నాణ్యతను పెంచడమే అసలు పరిష్కారం. పాఠశాల ఉపాధ్యాయుడు బోధించిన అంశాన్నే కోచింగ్ కేంద్రం పరీక్ష కోసం మరింత తీవ్రంగా బోధించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో పరిశీలించాలి. పాఠశాల పాఠ్యప్రణాళిక, ప్రవేశ పరీక్షల మధ్య అంతరాన్ని తగ్గించాలి. విద్యార్థుల ఆలోచనా శక్తి, సమస్య పరిష్కారం, అనువర్తన జ్ఞానం పెరిగేలా బోధన, మూల్యాంకన విధానాలను మార్చాలి.

పరీక్షలో గెలవడానికి విద్య అవసరం; కానీ జీవితంలో గెలవడానికి విద్య కేవలం పరీక్షా వ్యూహం కాదు. కోచింగ్ కేంద్రాలు ప్రశ్నపత్రాలను ఎలా ఛేదించాలో నేర్పవచ్చు. పాఠశాల మాత్రం ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోవాలో నేర్పాలి. ఒక దేశం తన పిల్లలను కేవలం ర్యాంకుల కోసం తయారు చేస్తే.. ర్యాంకులు సాధించవచ్చు; కానీ సృజనాత్మకమైన, ఆత్మవిశ్వాసం కలిగిన, సమస్యలను పరిష్కరించగల పౌరులను నిర్మించలేం. అందుకే కోచింగ్ సంస్కృతిని అంతం చేయడం లక్ష్యం కాకూడదు; కోచింగ్ అవసరం లేకపోయినా నాణ్యమైన విద్యార్థిని తయారు చేయగల పాఠశాలను నిర్మించడమే అసలు విద్యా సంస్కరణ.



హెచ్.ప్రతాప్
బాచిలర్స్ ఇన్ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్ ( ఉస్మానియా)
ఫ్లాట్ నెంబర్ : 405 ,శ్రీ బాలాజీ డిలైట్రా హుల్ కోలనీ, ఎ ఎస్ రావు నగర్
సాయి సుధీర్ కాలేజీ వద్ద హైదరాబాద్ 500 062
Mob No : 77998 00773

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు
- ఇరాక్, జోర్డాన్ వైపు ఇరాన్ క్షిపణులు
- కువైట్, బహ్రెయిన్‌లోనూ పేలుళ్ల కలకలం
- 13 క్షిపణులను కూల్చేశామన్న జోర్డాన్
- అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక



**టెహ్రాన్, సెప్టెంబర్ 2:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య పరస్పర దాడులతో పరిస్థితి వేడెక్కింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేపట్టగా.. ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులకు దిగినట్లు ఇరాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాక్, జోర్డాన్ వైపు ఇరాన్ క్షిపణులను ప్రయోగించగా.. కువైట్, బహ్రెయిన్‌లోనూ పేలుళ్ల సంభవించినట్లు సమాచారం. అమెరికా దాడుల్లో భాగంగా ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో ఓ పెళ్లి వేడుక జరుగుతున్న ప్రదేశం దెబ్బతిన్నట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. ఈ ఘటనలో ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందగా, సుమారు 50 మంది గాయపడినట్లు తెలిపింది. అయితే ఈ ప్రాణనష్టం వివరాలపై స్వతంత్ర నిర్ధారణ రావాల్సి ఉంది. అమెరికా దాడులపై ఇరాన్ నాయకత్వం తీవ్రంగా స్పందించింది. అమెరికాకు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రతినిధి హుస్సేన్ మొహబి హెచ్చరించారు. దాడులు ఎందుకు చేశామా అని చింతించే పరిస్థితి తీసుకొస్తామని వ్యాఖ్యానించారు. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడికి ప్రయత్నించడంతోనే తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు దాడులు కొనసాగినట్లు తెలిపింది. తమ భూభాగం వైపు దూసుకొచ్చిన 13 బాలిస్టిక్ క్షిపణులను గగనతలంలోనే అడ్డుకుని ధ్వంసం చేసినట్లు జోర్డాన్ సైన్యం ప్రకటించింది. మరో మూడు క్షిపణులు నిర్మానుష్య ప్రాంతాల్లో కూలిపోయాయని తెలిపింది. ఈ దాడుల్లో తమ దేశంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడించింది. ఇరాన్ ప్రయోగించిన పలు క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్లు కువైట్ కూడా ప్రకటించింది. బహ్రెయిన్‌లోనూ పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా దాడుల్లో చిన్నారి సహా పౌరులు మరణించినట్లు ఇరాన్ మీడియాలో వచ్చిన కథనాలపై అమెరికా సెంట్రల్ కమాండ్ స్పందించింది. తాము ఉద్దేశపూర్వకంగా సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని పేర్కొంది. అమెరికా–ఇరాన్ మధ్య ప్రత్యక్ష దాడులు, పొరుగు దేశాల గగనతలంలో క్షిపణుల కదలికలతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. తాజా పరిణామాలు మరింత విస్తృత ఘర్షణకు దారితీస్తాయేమోనన్న ఆందోళన నెలకొంది.

# అంతుచిక్కని ప్రకృతి విలయం


## 1127కి చేరిన వరద మృతుల సంఖ్య

## 4858 మంది కోసం ఇంకా గాలింపు

## డీఎన్ఏ టెస్టుల ద్వారా శవాల గుర్తింపు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్:** ప్రళయంలా విరుచుకుపడిన వరదలతో నేపాల్‌లో మరణమృదంగం కొనసాగుతోంది. ఊహించని విధంగా సంభవించిన ప్రకృతి విలయానికి అక్కడి ప్రజలు వేల సంఖ్యలో ప్రాణాలు వదిలారు. తాజా లెక్కల ప్రకారం వరద మృతుల సంఖ్య 1127కి చేరిందని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకూ ఆచూకి దొరకని వారి సంఖ్య కూడా సుమారు 5 వేల మందిపైగా ఉంటుందని అంచనా వేశారు.నేపాల్ వరదల్లో ఒక్క చిత్వాన్ జిల్లాలోనే అత్యధికంగా అంటే 348 మంది మృతదేహాలను వెలికితీశారు సహాయక బృందాలు. వారితో పాటు మరో 6,541 మందిని ప్రాణాలతో కాపాడి సురక్షిత ప్రదేశాలకు తరలించాయి రెస్క్యూ టీమ్స్. నేపాల్‌లో వరదలతో ఏర్పడిన విధ్వంసానికి సంబంధించిన చేదుజ్ఞాపకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొదట వెయ్యి మంది వరకు గల్లంతైనట్లుగా భావించిన అధికారులు ..ఇప్పుడు వరదల్లో చిక్కుకొని, గల్లంతైన వారిలో చనిపోయిన వారి సంఖ్యే 12 వందలకు చేరుకుంటోంది. 1127 మంది చనిపోయినట్లుగా నేపాల్ పోలీస్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఇక వరదల్లో గల్లంతై, బురదల్లో చిక్కుకుపోయిన వాళ్ల సంఖ్య కూడా 4858 మంది వరకు ఉన్నారని అక్కడి జనాభా లెక్కల ప్రకారం తెలుస్తోంది. మరీ ముఖ్యంగా చిత్వాన్ జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో మృతదేహాలను వెలికి తీశారు. గత వారం రోజులకుపైగా కొనసాగుతున్న సహాయకచర్యల్లో భాగంగా ఇప్పటి వరకు 348 మృతదేహాలను వెలికితీశారు. నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహుల జిల్లాల్లో కూడా చనిపోయిన వారి సంఖ్యలో వందల్లోనే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారు, గల్లంతైన వారితో పాటు తీవ్రంగా గాయాలపాలైన వాళ్ల కోసం కోసం రెస్క్యూ బృందాలు విస్తృతంగా శ్రమిస్తున్నాయి. 7,912 మంది పోలీసు సిబ్బంది వరదలు సంభవించిన 4 జిల్లాల్లో 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా రక్షించాయి. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. నేపాల్‌లో సంభవించిన వరదలు ఆకస్మిక వరదలు మాత్రమే కాదని రాకాసి వరదలుగా చూస్తున్నారు అక్కడి ప్రజలు.



# ఉక్రెయిన్‌పై దాడిలో జగిత్యాల వాసి మృతి

**జగిత్యాల, సెప్టెంబర్ 2:** ఉక్రెయిన్‌పై రష్యా చేసిన భారీ దాడిలో జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్‌గౌడ్(42) మృతి చెందాడు. మంగళవారం ఉదయం తాను నివాసం ఉంటున్న గది నుంచి బయటకు వచ్చిన సమయంలోనే ఈ దాడి జరగడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు విడి చాడు. స్వగ్రామంలో సెంట్రింగ్ పని చేసిన సుదర్శన్‌గౌడ్ నాలుగు నెలల క్రితమే ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్ వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున కీవ్ సహా పలు ప్రాంతాలపై క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.. కాగా సుదర్శన్‌గౌడ్‌తో పాటు ఉక్రెయిన్‌లో ఉంటున్న తాటిపెల్లి గ్రామానికి చెందిన వేణు ద్వారా ఈ ఘటన గురించి మృతుడి కుటుంబసభ్యులకు తెలిసింది.

# నేపాల్‌లో మళ్లీ వర్షాలు

## ఉప్పొంగుతున్న మూడు ప్రధాన నదులు

**ఖాట్మాండ్, సెప్టెంబర్ 2:** నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్శ్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటి వరకు 1,113 మృతదేహాలకు పోస్ట్‌మార్టం.. చట్టపరమైన గుర్తింపు పక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపులేని 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటి వరకు 6,541 మందిని రక్షించగా..4,858 మంది గల్లంతయ్యారు. 7,912 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు.

# ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

## పునర్వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో

## 30 వేలకు పడిపోనున్న ఉద్యోగుల సంఖ్య

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2:** ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ–మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.



## విద్యార్థులకు బ్యాగులు అందించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**మిరుదొడ్డి, సెప్టెంబర్ 02, :**
మిరుదొడ్డి ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు చెరుకు ముత్యం రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి బుధవారం బ్యాగులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడంతో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్, వైస్ చైర్మన్ చెన్నె భూపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేరండ్ల భూమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్, చెరుకు ముత్యంరెడ్డిల వర్ధంతి వేడుకలు



**అక్బర్ పేట భూంపల్లి, సెప్టెంబర్ 02, :**
దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డిల వర్ధంతి వేడుకలను దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట–భూంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూండా శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చెరుకు ముత్యంరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహానాయకులు వైఎస్సార్, చెరుకు ముత్యంరెడ్డి అని కొనియాడారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయక పదవికి రాజీనామా చేయాలి

- ప్రజా సమస్యలపై ప్రశ్నించడంలో విఫలమైన ప్రతిపక్షం.. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి,సెప్టెంబర్ 02, :** ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల తరపున బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమైన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంపేట్ సర్కిల్‌లో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రజల పక్షాన పోరాడాల్సిన ప్రతిపక్షం తన బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అంతకుముందు బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా నిజాంపేట్ సర్కిల్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడ నిరసన చేపట్టి కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉందని, అయితే కేసీఆర్ ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆరోపించారు. ప్రజల గొంతుకగా నిలబడలేని పరిస్థితిలో ప్రతిపక్ష నాయకుడి పదవిలో కొనసాగడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, పార్టీ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వర్గీయ వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- చిన్నకోడూరు మండల కేంద్రంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి
- వైయస్సార్ చిత్రపటానికి ఘనంగా నివాళులు
- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్



**చిన్నకోడూరు, సెప్టెంబర్ 02, :**
పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి, ప్రజలకు విశేష సేవలందించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని చిన్నకోడూరు ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీసం మహేందర్ యాదవ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచిన మహానేతగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు పాకాల భూపతిరెడ్డి, ఎండీ సలీం, సింగిరాల లక్షి , జిల్లా జనరల్ సెక్రటరీ పంతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంద శ్రీకాంత్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పుట్ల యేసు, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఉడుత జయంత్, అంతగిరి శేఖర్, మాజీ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, అల్లిపూర్ సొసైటీ మాజీ డైరెక్టర్ రెడ్డి మహేందర్‌రెడ్డి, అల్లిపూర్ ఉపసర్పంచ్ కొలనుపాక శ్రీనివాస్‌రెడ్డి, దుగ్యాని వెంకటేశం, గొట్టిపర్తి చందు, కనకరాజు, జగన్, మహేష్, భాస్కర్, శ్రీనివాస్, దుర్గాచారి, రాజిరెడ్డి, జక్కుల నాగరాజు, కొలను గణేష్, రాకేష్, అరుణ్, మల్లేశం, కనకయ్య, తిరుపతిరెడ్డి, అరవింద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుంది

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య





**మిరుదొడ్డి, సెప్టెంబరు 02, :**
క్రీడలతో విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల కూడలిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల– కళాశాల మైదానంలో మాధవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్‌బాబు, ఏఎంసీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్, నైపుణ్య ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట కమలాకర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల సంక్షోభ పాలన

- బీఆర్ఎస్ నేతల ఆరోపణ
- అంబేద్కర్ సర్కిల్ వద్ద బిఆర్ఎస్ శ్రేణుల నిరసన





**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజా సంక్షేమం సంక్షోభంలో పడిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియ జేసేందుకు బుధవారం సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీ బ్యానర్‌ను ప్రదర్శించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అవుతున్నా హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి నిలిచిపోయిందని, రాష్ట్రంలో అవినీతి పెరిగిందని ఆరోపించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో బూతులు, భూ కబ్జాల ఆరోపణలు పెరిగాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు తెలియజేసేందుకే భారీ బ్యానర్‌ను ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. వచ్చే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ వినూత్న నిరసన

- ఆరు గ్యారంటీల బకాయి కార్డుల పంపిణీ



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల అమలులో ప్రజలకు జరిగిన జాప్యాన్ని ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం వినూత్న నిరసన చేపట్టారు. పట్టణంలోని 29వ వార్డులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీల బకాయి కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలనలో హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎండీ షాహీద్, రమేష్, ఫేక్రుద్దీన్, శమ్ము, అక్రమ్, కిష్టవ్వ, భాగ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే చెల్లించాలి

- విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- ఎబీవీపీ వినతిపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 02, :**
విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను అవసరమైతే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమాధానం కోరుతామని స్పష్టం చేశారు.పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదని పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వం నుంచి సమాధానం కోరుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కో–ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు అశోక్, మేరాజ్ ఖాన్, చెన్నారెడ్డి, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో ముందుకు సాగుదాం

- జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ దాసరి పవన్
- సిద్దిపేటలో ఘనంగా జన్మదిన వేడుకలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను బుధవారం సిద్దిపేటలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, జనసేన సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దాసరి పవన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శరభేశ్వర ఆలయంలో అభిషేకం, అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, రక్తదాన శిబిరం నిర్వహించారు. అభయజ్యోతి మానసిక వికలాంగుల కేంద్రంలో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, జనసైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి పవన్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ భవిష్యత్తులో ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. తెలంగాణలో రానున్న ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జనసేన అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి



అవుతారని పవన్ కళ్యాణ్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ వ్యాప్తంగా జనసేనలోకి పెద్ద ఎత్తున చేరికలు జరగనున్నాయని, ఇది పార్టీ విజయానికి సంకేతమని అన్నారు. కార్యక్రమాల్లో గొడుగు శివ, కృష్ణ, మల్లేశం, ప్రశాంత్, బాలు, నరేష్, ఐమాద్, రఘు, అక్కలదేవి రమేష్, హరీష్, శ్రీనివాస్, రవి, మహేష్, సురేష్, స్వామి, అజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధి, పారిశుధ్యంపై ఎమ్మెల్యే సమీక్ష



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చెరువుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. చెరువులను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. చెరువుల పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువులు, కాలువలు, డ్రైనేజీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీలను శుభ్రం చేయాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. చెరువుల కట్టలు, పరిసర ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు స్పష్టం

# మహానేత వైఎస్సార్ ఆశయాలే స్ఫూర్తి

**నంగునూరు, సెప్టెంబర్ 02, :**
మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలే తమకు స్ఫూర్తి అని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బుధవారం నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్, ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ వైఎస్సార్ గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు ఆరోగ్యం, విద్యా రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన పాదయాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి కష్టాలను తెలుసుకున్న నాయకుడు వైఎస్సార్ అని అన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుట్టం రంగారెడ్డి, గట్లమల్యాల మాజీ సర్పంచ్ కర్ణకంటి రవీంద్ర, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సామ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బొల్లు



సంజీవ్ యాదవ్, బడే అశోక్, నవీన్, సోప్పరి రాజ్‌కిరణ్, శంకరయ్య, సదానందం, మహేష్, శేఖర్, భాను, రాజు, శివ, బాబు, పాలపు కనకయ్య గౌడ్, అభినయ్‌తో పాటు కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థుల బస్ సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం

## ఎమ్మెల్యేకు విద్యార్థులు, తల్లిదండ్రుల కృతజ్ఞతలు



**జగిత్యాల/కోరుట్ల, సెప్టెంబర్ 02, :**
రెండు రోజుల క్రితం బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యార్థులు ధర్నా నిర్వహించగా విషయం తెలుసుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెంటనే స్పందించారు. కోరుట్ల ఆర్టీసీ ఆర్ఎం, డీఎంతో మాట్లాడి విద్యార్థుల కోసం అదనంగా బస్‌ను కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఈరోజు అదనపు బస్‌ను అందుబాటులోకి తీసుకురాగా, ఎమ్మెల్యే సంజయ్ స్వయంగా విద్యార్థులతో కలిసి కోరుట్ల నుంచి కల్లూరు మోడల్ స్కూల్ వరకు బస్‌లో ప్రయాణించారు. విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి బస్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే సంజయ్ కి విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే సంజయ్

# విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ అవసరమే

- క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 02, :**
విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. బుధవారం చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ 70వ మండల సమాఖ్య స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించ[illegible]ంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులు రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం





చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో క్రీడలకు మరింత ప్రాధాన్యం కల్పించే సంకల్పంతో గచ్చిబౌలి క్రీడా మైదానాన్ని సుమారు రూ.750 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీడీలు, ఉప సర్పంచులు కన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సలీమ్, భూపతిరెడ్డి, లక్ష్మి , వార్డు సభ్యులు రఘు, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయడంలో సీఎం విఫలం

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 02, :**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విఫలం అయ్యారని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం బిఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. ప్రజలకు కాంగ్రెస్



అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల గ్యారెంటీ కార్డులను పంపిణీ చేసి కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి పాలనలో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే సమయం దగ్గర పడిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి, బాలరాజు, సత్యనారాయణ, పోలీస్ రాజులు, బైరయ్య తదితరులు పాల్గొన్నారు....

# కొడిమ్యాల హైస్కూల్లో పద్య పఠన పోటీలు కార్యక్రమం

- విజేతలకు ప్రశంస పత్రాలు, మెమంటోలు అందజేసిన ఎంఈఓ

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 02, :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలులో బుదవారం జగిత్యాల జిల్లా తెలుగు భాష ఫోరం వారి ఆధ్వర్యంలో మండల తెలుగు భాష ఉపాధ్యాయులు పద్య పఠన పోటీల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పద్య పఠన పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ముఖ్య అతిథిగా కార్యక్రమానికి విచ్చేసిన మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి కాలంలో పద్య పఠన ఆవశ్యకత ఎంతో ఉందని నీతి పద్యాలు చదవడం వల్ల మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు విద్యార్థులు తెలుసుకోగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా కవి నాగభూషణం చారి, రామాచారి పండితులు ఉన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల విద్యాధికారి ప్రశంస పత్రాలు, మెమంటోలు అందచేశారు. భాష ఉపాధ్యాయులు, న్యాయ నిర్ణేతలను, విద్యాధికారి నీ ఘనంగా శాలువాలతో సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర అధ్యక్షతన మొదటి సారి జరిగిన ఈ పద్య పఠన పోటీల కార్య క్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొని బహుమతులు అందుకున్నారు. గెలుపొందిన



విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగు భాష ఉపాధ్యాయులు వెంకట రమణ, కే. అనిత, ఏ శేఖర్, సుమన్, అంజయ్య సరోజన పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య డైలాగ్ వార్






- పోటాపోటీ విమర్శలు చేసుకున్న కాంగ్రెస్ బిఆర్ఎస్ నేతలు

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 2,**
వెయ్యి రోజుల పాలన పై బుధవారం దుబ్బాకలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచి వెయ్యి రోజులు గడిచిన ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారంటూ కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. దుబ్బాక బస్టాండ్ ఎదుట ఫ్లెక్సీని దగ్ధం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించగా, కేసీఆర్ గెలిచిన తర్వాత ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని, వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. దీంతో దుబ్బాకలో రెండు పార్టీల మధ్య రాజకీయ వేడి నెలకొంది.

# వైఎస్సార్ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 02, :**
మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్



భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా గాజులరామారంలోని ఎస్పీఆర్ ట్రస్ట్ గ్లోబల్ స్కూల్‌లో చిన్నారులు వైఎస్సార్ ప్రవేశపెట్టిన పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమ పథకాలను ముగ్గుల రూపంలో ప్రదర్శించి ఆయన సేవలను, ఆశయాలను స్మరించుకున్నారు. స్కూల్ చైర్మన్ పున్నారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, నేటి యువతకు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను పరిచయం చేస్తున్నామని తెలిపారు.

# వైఎస్సార్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం

- 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు ఏర్వ వెంకటరమణ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 02 :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మహోన్నత నాయకుడని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు ఏర్వ వెంకటరమణ అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గిరినగర్ డివిజన్ సీనియర్ మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ మెయిన్‌రోడ్‌లోని ఆయన కార్యాలయంలో నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏర్వ వెంకటరమణ కాంగ్రెస్ నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ పనిచేశారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం రాజీవ్ గృహకల్ప, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేసి సామాజిక, ఆర్థిక రంగాల్లో గణనీయమైన మార్పుకు బాటలు వేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమ దృక్పథాన్ని కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితమవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్టె శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగుతోందని, ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, చోటు నవాజ్, శంకర్, సల్మాన్, ఆరిఫ్, హుస్సేన్, నసీర్, అజీమ్ తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.



# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



- కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 02 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మహాదేవపురం డివిజన్‌లోని మహాదేవపురం చౌరస్తాలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ చూపిన మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని హనుమంత్ రెడ్డి ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు షఫీతో పాటు అఫ్జల్, అజామ్, రఫియాబేగం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కొడిమ్యాలలో ఘనంగా 17వ వైస్సార్ వర్ధంతి

- ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**చొప్పదండి /కొడిమ్యాల: సెప్టెంబర్ 02, :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కొడిమ్యాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోగూరీ నాగ భూషణ్ రెడ్డి, కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, నాయకులు కొండూరు రాజేష్ , అజయ్ రెడ్డి, మ్యాకల మల్లేశం, పాపి రెడ్డి, గోల్కొండ రాజు, లక్ష్మా రెడ్డి, నరసయ్య, నజీర్, శంకర్, ముమడి స్వామీ, కంబాల రాజమల్లు, గాజుల అజయ్, రమేష్, జలంధర్, కవ్వం మధు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 22-ఏ నిషేధిత భూముల జాబితాల రూపకల్పనలో అత్యంత జాగ్రత్త వహించాలి

- దేవాదాయ శాఖ భూములపై ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాలి
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత

**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 02, :** జగిత్యాల జిల్లాలోని దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను 22-ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చే ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాల తయారీ, పరిశీలన, తుది ఖరారుపై జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆ శాఖ సిబ్బందితో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ

దేవాలయాలు, ఇతర దేవాదాయ సంస్థలకు చెందిన భూముల సర్వే నంబర్లు, ఉప విభాగ సంఖ్యలు, విస్తీర్ణం, భూమి వర్గీకరణ, యాజమాన్య వివరాలు, రెవెన్యూ మరియు దేవాదాయ శాఖ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే 22-ఏ జాబితాలను తుది ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, సంబంధిత రికార్డులను పరస్పరం సరిచూసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ భూములు పొరపాటున జాబితా నుంచి మినహాయించబడకుండా, అలాగే తప్పుడు సర్వే నంబర్లు లేదా విస్తీర్ణాలు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, దేవాదాయ శాఖ ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎలాంటి లోపాలు, అనధికార మార్పులు లేదా మినహాయింపులు చోటుచేసుకోకుండా ప్రతి ప్రతిపాదనను బాధ్యతాయుతంగా పరిశీలించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, దేవాదాయ శాఖ రిజిస్టర్లు మరియు ఇతర ఆధారాలను సమగ్రంగా ధృవీకరించిన అనంతరమే జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, సంబంధిత భూముల విషయంలో ప్రభుత్వ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించిన, దోషరహితమైన తుది 22-ఏ నిషేధిత భూముల జాబితాలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'గేట్'తో అవకాశాలను అందిపుచ్చుకోండి

- గీతం విద్యార్థులకు గేట్ ఏరోస్పేస్ అకాడమీ అశోక్ నాయుడు సూచన

**పటాన్చెరు, సెప్టెంబర్ 02, :** ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గేట్) శ్రేష్ఠతకు ముఖద్వారం వంటిదని, గేట్‌లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా ఉన్నత విద్యతో పాటు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని గేట్ ఏరోస్పేస్ అకాడమీకి చెందిన అశోక్ నాయుడు అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు.విభాగాధిపతి ప్రొఫెసర్ నాతి వేణుకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అశోక్ నాయుడు మాట్లాడుతూ.. గేట్ ద్వారా ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), రక్షణ, పరిశోధనా సంస్థలు, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.రక్షణ రంగంలో ఏఎఫ్‌క్యాట్, సీడీఎస్, ఎస్ఎస్‌సీ టెక్నికల్, యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్, టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు, ఎన్‌సీసీ తదితర మార్గాల ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. హెచ్ఏఎల్, డీజీసీఏ వంటి సంస్థల్లోనూ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అవకాశాలు ఉన్నాయని వివరించారు.పరిశోధన, ఉన్నత విద్య వైపు కూడా విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. డీఆర్‌డీఓ, డీఆర్‌డీఎల్‌లో శాస్త్రవేత్తలుగా, భారత వైమానిక దళంలో టెక్నికల్ అధికారులుగా, సీఎస్ఐఆర్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లతో పాటు ఐఐటీలు, ఐఐఎస్సీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఏకాగ్రతతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అశోక్ నాయుడు సూచించారు.



# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులకు ఒరిగిందేమీ లేదు

- టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 02, :** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టుల సంక్షేమానికి ఒరిగిందేమీ లేదని టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమ పునాదులపై ఏర్పడిన టీయూడబ్ల్యూజే హెచ్–143 ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఆరోగ్య బీమా తదితర పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత తమ యూనియన్‌దేనని పేర్కొన్నారు.పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం టీయూడబ్ల్యూజే హెచ్–143 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి యోగానంద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు భాస్కర్ పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.నియోజకవర్గంలోని జిన్నారం, గుమ్మడిదల, అమీన్పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మండలాలకు చెందిన టీయూడబ్ల్యూజే హెచ్–143 సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను వందశాతం పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఆస్కాని మారుతిసాగర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతోపాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన చరిత్ర టీయూడబ్ల్యూజే హెచ్–143కు ఉందన్నారు. రూ.100 కోట్ల జర్నలిస్టుల సంక్షేమ నిధితో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో బాధిత జర్నలిస్టులకు, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలిచిన ఘనత తమ యూనియన్‌దేనన్నారు.2013లో టీజేఎఫ్ పునాదులపై నిర్మితమైన టీయూడబ్ల్యూజే హెచ్–143 జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిందని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో టీయూడబ్ల్యూజే నాయకత్వం బలంగా ఉందని, గతంలో పలు జాతీయస్థాయి కార్యక్రమాలను నిర్వహించి విజయవంతం చేసినట్లు తెలిపారు.జర్నలిస్టుల సంక్షేమానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టారు. గతంలో 100 మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించడంతోపాటు, కోటి రూపాయల సొంత నిధులతో నియోజకవర్గంలోని జర్నలిస్టు కుటుంబాలకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర నాయకులు శ్రీధర్, తిరుపతినాయక్, జిల్లా నాయకులు నగేష్, పరశురాం, వేణు, రాజు, రాఘవరెడ్డితో పాటు పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.




# కేవీఆర్ వ్యాలీకి కొత్త రహదారి.. రూ.28 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- కాలనీ వాసుల సమస్యపై తక్షణ స్పందన.. నిధులు మంజూరు చేయించిన కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సెప్టెంబర్ 02, :** 296వ డివిజన్ దుండిగల్ పరిధిలోని కేవీఆర్ వ్యాలీలో దెబ్బతిన్న సీసీ రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టే చర్యలు ప్రారంభమయ్యాయి. కాలనీలో రహదారి పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిఎంసీ నిధుల నుంచి రూ.28 లక్షలు మంజూరు చేయించి, నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. రహదారి నిర్మాణం పూర్తయితే కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు, రోడ్డు సౌకర్యం మరింత మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపి నిధులు మంజూరు చేయించిన కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రఫియా బేగం, మహదేవ పురం డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మనోజ్ రెడ్డి, మహేందర్ యాదవ్, కావలి శశికుమార్, పద్మారావు, ఆలేటి శ్రీనివాస్, మల్లంపేట్ ప్రకాష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# గంట శివరెడ్డికి కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** మహాదేవ్‌పూర్ లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంట శివరెడ్డి జన్మదిన వేడుకల్లో బుధవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి తోపాటు టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట శివరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, మైనారిటీ అధ్యక్షులు షఫీ, అఫ్జల్, అజామ్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మైసిగారి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రఫియా బేగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



చురకలు




# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**సదాశివపేట, సెప్టెంబర్ 02, :**
డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సూచించారు. సైబర్ జాగృకత దివాస్‌ను పురస్కరించుకుని సదాశివపేట పట్టణంలోని హర్ష బ్యాంకెట్ హాల్‌లో బుధవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు పలు సూచనలు చేశారు.తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

**ఓటీపీ, పిన్ వివరాలు చెప్పొద్దు:**

తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయరాదని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు ఇవ్వకూడదన్నారు. డిజిటల్




చెల్లింపులు చేసే సమయంలో నగదు సరైన వ్యక్తి ఖాతాకే వెళ్తుందో నిర్ధారించుకోవాలని సూచించారు.

**ఆన్‌లైన్ షాపింగ్‌లో జాగ్రత్త:**

భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లు, వ్యక్తులకు ముందస్తుగా నగదు చెల్లించ కుండా విశ్వసనీయమైన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను మాత్రమే వినియో గించాలని సూచించారు.

**అధిక లాభాల ఆశ చూపితే నమ్మొద్దు:**

ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్, క్రిప్టో, షేర్ మార్కెట్ పేరుతో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. పెట్టుబడి పెట్టేముందు సంబంధిత వ్యక్తులు, సంస్థల వివరాలను పూర్తిగా పరిశీలించాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సత్వరమే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

**గణేష్ మండపాల వద్ద అవగాహన**

గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేసి భక్తులు, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. శాంతి కమిటీ, సమన్వయ సమావేశాలను కూడా సైబర్ అవగాహనకు వినియోగించాలని సూచించారు.సైబర్ నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా కీలకమని, చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారితీయవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.కార్యక్రమంలో డి4సీ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి, సైబర్ సెల్ సిబ్బంది, సదాశివపేటకు చెందిన సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన

- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం
- మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యక్రమాల అమలు
- యువతకు ప్రాధాన్యత ఇస్తూ 70 వేలకు పైగా ఉద్యోగాల కల్పన
- రాహుల్ గాంధీ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం
- సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజామోదం పొందిన ప్రజాపాలన
- రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు
- సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తోందని సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె సంగారెడ్డిలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించచి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాలనను పూర్తి చేసుకుందన్నారు. ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపాలన కొనసాగుతోందని అన్నారు. మరో రెండేళ్లలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యత చేపట్టిన రెండు రోజుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించారన్నారు. మహిళలను కోటేశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే కాకుండా మహిళలను బస్సులకు యజమానులుగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పెట్రోల్ బంకుల నిర్వహణ, పావలా వడ్డీ రుణాలు తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ చీరలను మహిళలు ఎంతో సంతోషంగా స్వీకరిస్తున్నారని తెలిపారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సన్న బియ్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని పరిస్థితి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటికి పైగా రేషన్ కార్డులు మంజూరు చేసి పేదలకు ఆహార భద్రత కల్పించిందని ఆమె తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువయ్యాయని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని నిరుపేదల కలను సాకారం చేస్తున్నామని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. పేద కుటుంబాలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యారంగంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటు లోకి వచ్చిందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. వైద్య సహాయం కోసం గత ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఎల్ఓసీ అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ఎన్నికల హామీలుగా కాకుండా బాధ్యతగా భావించి అమలు చేస్తోందని ఆమె అన్నారు. రానున్న రెండేళ్లలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, సీనియర్ నాయకుడు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్.. ఘన నివాళులు

- 17వ వర్ధంతి సందర్భంగా షాపూర్‌నగర్ చౌరస్తాలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు — ప్రజా సంక్షేమమే ఆయనకు నిజమైన నివాళి: కూన రాఘవేందర్ గౌడ్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 02, :**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని షాపూర్‌నగర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అందించిన సేవలను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన పాదయాత్రను, సామాన్యుల కష్టాలను అర్థం చేసుకుని అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన వైఎస్సార్ సేవలు, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజల పట్ల ఆయన చూపిన నిబద్ధత, పేదల పట్ల ఆయనకు ఉన్న ఆప్యాయత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేందర్ గౌడ్, 291వ



డివిజన్ షాపూర్‌నగర్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించారు. మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం.. ఆయన ఆశయాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: కొలన్ హన్మంత్ రెడ్డి

- ప్రగతి నగర్‌లో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 02, :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ప్రగతి నగర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. 276వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తతిరెడ్డి) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పాలనలో ప్రధాన లక్ష్యంగా చేసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన మహానేతగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ చూపిన ప్రజా సంక్షేమ మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. పేదలు, రైతులు, సామాన్య ప్రజల అభ్యున్నతికి కృషి చేయడమే వైఎస్సార్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో 276వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘన నివాళులర్పించారు.

# కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ ధర్నా

- 420 హామీల అమలుకు డిమాండ్.. 420 అడుగుల బ్యానర్‌తో వినూత్న నిరసన

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 02, :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌లో భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నాయకత్వ స్ఫూర్తితో ఈ నిరసన చేపట్టారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 420 అడుగుల భారీ బ్యానర్‌తో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జీడిమెట్ల 132వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్



నాయకులు వీరారెడ్డి నరేందర్‌రెడ్డి, కుంట సిద్దిరాములు తదితరులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన తెలిపారు.

# భౌరంపేట్‌లో శ్రీ ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన శక్తానంద గిరి స్వామి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్‌లో మల్లన్న గుడి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శ్రీ ఎల్లమ్మ ఆలయాన్ని ఐశ్వర్యాంబిక తపోవనం త్రిశక్తి పీఠం పూజ్య గురువులు శ్రీ శ్రీ శ్రీ శక్తానంద గిరి స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన స్వామివారు, ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు, నాయకులు, భక్తులు స్వామివారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీరామ్ జి గ్రామ సభల్లో పాల్గొన్న ఎంపీడీఓ స్వరూప

**చొప్పదండి ప్రతినిధి, సెప్టెంబర్ 02, :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని విబిజిరాంజిలో భాగంగా గౌరాపూర్, నర్సింహులపల్లి గ్రామాల్లో బుధవారం వికసిగ్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారు చేయుటకు గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గ్రామసభల్లో ఎంపీడీవో స్వరూప హాజరై 2026– 27 సంవత్సరానికిగాను విబిజిరాంజిలో తెలిపిన ప్రకారం నీటి భద్రత పనులు, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులు, జీవనోపాధికి సంబంధించిన పనులు, విపత్తు నిర్వహణ సంబంధించిన పనులు మొత్తం 318 రకాల పనులను తెలపడం జరిగింది. వీటిలో ఆయా గ్రామాల ప్రజలకు



అవసరం ఉన్న పనులు వాస్తవ అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యతలను అనుగుణంగా పనుల్ని ఎంపిక చేసుకోవాల్సిందిగా తెలపడం జరిగింది. ప్రతి గ్రామంలో కూడా వందకి తక్కువ కాకుండా ఉపాధి కూలీలు పనులకు వచ్చునట్లుగా చర్యలు చేపట్టవలసిందిగా గ్రామపంచాయతీ పాలకవర్గానికి తెలపడం జరిగినది. మొదటి గ్రామ సభలో తీసుకున్న పనులను రెండవ గ్రామ సభలో ఆమోదం తీసుకొని మండల పరిషత్ కార్యాలయానికి పంపుటకు కోరనైనది. సర్పంచ్, పాలకవర్గం సభ్యులు వారి గ్రామాల్లో అవసరమైన పనులను గ్రామ సభల్లో చర్చించడం జరిగినది. ఈ కార్యక్రమాల్లో గ్రామ సభలకు సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శిలు, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## గంట శివరెడ్డికి కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** మహాదేవ్‌పూర్ లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంట శివరెడ్డి జన్మదిన వేడుకల్లో బుధవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి తోపాటు టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట శివరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, మైనారిటీ అధ్యక్షులు షఫీ, అఫ్జల్, అజామ్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మైసిగారి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రఫియా బేగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మందలపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనుల పరిశీలన - ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, సెప్టెంబర్ 02, :** దమ్మపేట మండల కేంద్ర శివారులో గల మందలపల్లి ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం పరిశీలించారు. బస్టాండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రీమోడలింగ్ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే బస్టాండ్ పరిసరాల్లో నిర్మాణం పూర్తయిన విశాలమైన సీసీ రహదారి ని పరిశీలించారు. ప్రయాణికులకు, రాను పోవు బస్సులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణం పూర్తి అవ్వడం పై వివరాలు తెలుసుకున్నారు. మందలపల్లి బస్టాండ్ ద్వారా ప్రయాణించే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం అని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.<

## సెక్యూరిటీ గార్డ్ మహిళను అత్యాచారం చేసిన బండి రమేష్ పై కేసు నమోదు చేయాలి

- సహకరించిన చల్లా శ్రీనివాసరెడ్డి పైన కఠినమైన కేసులు నమోదు చేసి శిక్షించాలి
- బాధితురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలి
- ప్రభుత్వ హాస్పిటల్లో సురక్ష ఏజెన్సీని రద్దు చేయాలి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లో గత అనేక సంవత్సరాలుగా ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహిళను బెదిరించి పలుమార్లు అత్యాచారం చేసిన, కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించిన బండి రమేష్ పైన, అతనికి సహకరించిన కాంట్రాక్ట్ ఏజెన్సీ యజమాని చల్లా శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేయాలని, వెంటనే రిమాండ్ చేసి జైల్లో వేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్ష ఏజెన్సీ రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య భద్రత కోసం హాస్పిటల్ కి వస్తే రోగాలు తగ్గటం మాట మరచి ప్రజల యొక్క గౌరవాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఇటువంటి కాంట్రాక్ట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కుటుంబ అవసరాల కోసం మహిళలు ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తుంటే పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేదని మరోసారి రుజువైందని అన్నారు. ప్రతి గంటకు రెండు అత్యాచారాలు, ప్రతి అరగంటకు మహిళల మీద దాడులు పెరిగాయని తెలిపారు 2013 చట్టం ప్రకారం ప్రతి పరిశ్రమలో, పని ప్రదేశాల్లో మహిళా భద్రతా కమిటీ ఏర్పాటు చేయాలని ఉన్నా ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు పట్టించుకోవడంలేదని మహిళల భద్రతను గాలికి వదిలేసారని అన్నారు. చల్ల శ్రీనివాసరెడ్డికి రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి కలిగి ఉన్నాడని, కేసును నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తాడని మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో బాధితురాలికి అండగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని గోపాలస్వామి హెచ్చరించారు.

## కవితపై అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

**టిఆర్ఎస్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్**



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు కమెంట్స్ పెట్టిన వారిమీద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం కరీంనగర్ లోని ఒకటోవ పోలిస్ స్టేషన్ లో జిల్లా పార్టీ బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆద్వర్యంలో పోలిసులకు పిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కవితమ్మ మీద అసభ్యకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కవితమ్మ మీద సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇతర సోషల్ మీడియా గ్రూపులలో అత్యంత అసభ్యకరమైన, అవమానకరంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ కె అనిల్ మీద తక్షణమే చట్టపరంగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేయడం జరిగిందని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళ నాయకురాలి మీద అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసి కవితమ్మ గౌరవాన్ని ప్రతిష్టను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం యావత్ మహిళలోకానికి జరిగిన అవమానంగా భావించాలని. కానిస్టేబుల్ అనిల్ చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు అన్నారు. పవిత్రమైన పోలిస్ ఉద్యోగంలో ఉన్న అనిల్ ప్రజలకు చట్టపరంగా రక్షణ, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన ఒక బాధ్యత కలిగిన పోలీస్ ఉద్యోగంలో ఉండి ఈ విధంగా ఒక మహిళా రాజకీయ నాయకురాలిని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం పైన అతడి వెనుక ఉన్న వ్యక్తులు ఎవ్వరూ అనేది కూడ తేల్చాలి. పోలీస్ శాఖ కూడ అతడి మీద శాఖాపరమైన విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, మనకోండూర్ నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య, చొప్పదండి నియోజకవర్గం నాయకులు మ్యాకల తిరుపతి, జిల్లా పార్టీ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, బసవేణి రాజేందర్, యండి హుస్సేన్, యండి రాజీ, మడిపల్లి వినీత్, బాండారి అభిరామ్, జిల్లా మహిళ నాయకురాలు జంగ అపర్ణ, అసియా సుల్తానా, పల్లె శారద, తుట్టేవార్ అకాష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ముత్యంరెడ్డి సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి
- దుబ్బాలో ముత్యంరెడ్డికి ఘన నివాళులు



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** స్వర్గీయ మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ముత్యంరెడ్డి చిత్రపటానికి ఆయన తనయుడు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దుబ్బాక పట్టణ కేంద్రంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో మాజీ మంత్రి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు ముత్యంరెడ్డి అని అన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలన్నారు. ప్రాణం పోయేంత వరకు నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేశాని, నియోజకవర్గంలో ప్రతి మండలానికి మార్కెట్ యార్డు, విద్య అభివృద్ధి కోసం మోడల్ స్కూల్, గురుకుల హాస్టల్లను, దళితులుల కోసం దళిత బందు ద్వారా సిఎల్ డిపి పథకం ద్వారా ఉచితంగా బోర్లు వేయించారని గుర్తు చేశారు. అనంతరం సర్గీయ దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్యుఐ, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, మహిళా నాయకురాల్లు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ప్రదాత వైయస్సార్

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్ వర్ధంతి కార్యక్రమం
- వైఎస్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే, డిసిసి ప్రెసిడెంట్



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కీ.శే. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య. వైఎస్ చేపట్టిన ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంట్, ఫీజ్ రీయింబర్స్మెంట్ ఇలా అనేక పథకాలు ప్రజల్లలో చిరస్థాయిలో ప్రజలు గుండెల్లో ఉన్నాయి. పాదయాత్రలో పల్లెలను పరిశీలించి రైతులతో మాట్లాడి అధికారంలోకి వచ్చాక రైతు పక్షపాతి పథకాలు ప్రవేశ పెట్టారు. సాగు నీటి అంశాల విషయంలో వైఎస్ ఆశయాలకు అనుగుణంగా స్థానిక జగిత్యాల నాయకులు పనిచేయలేక పోయారు. జగిత్యాలలో ఇందిరమ్మ కాలనీని మంజూరు చేసింది వైస్సార్ అని కొనియాడారు. దీనికి మౌలిక సదుపాయాలు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ద్వారా పూర్తి చేస్తున్నామని సంజయ్ కుమార్ తెలిపారు. జగిత్యాలలో అర్బన్ హౌసింగ్ కాలనీలో వైఎస్ 2008లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే అక్కడ కరెంట్ కనెక్షన్ తీసుకున్నది. 2009 వరకు ఒకరు మాత్రమే 2014వరకు పదుల సంఖ్యలో మాత్రమే 2020 వరకు 170మంది 2024లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలుకు 36కోట్లు మంజూరుతో ప్రజల్లో ఆశ చిగురించి 2026లో 3500మంది విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారుని, ఇందిరమ్మ కాలనీ వాసులకు రేవంత్ సర్కార్ పూర్తి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. త్వరలో దాదాపు అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ గిరి నాగభూషణం పిసిసి సెక్రెటరీ బండ శంకర్, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, పిసిసి సేవాదళ్ సెక్రెటరీ ముఖేష్ కన్నా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, ఎన్ఎస్యుఐ భార్గవ్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు ద్యావన్ పల్లి. రాజేందర్, డీసీసీ ఉపాధ్యక్షులు జెల్ల రవి, రేపల్లె హరి కృష్ణ, డీసీసీ కార్యదర్శి పులి నర్సయ్య, కూసరి అనిల్, లైశెట్టి చంద్ర మౌళి, కోలా శ్రీనివాస్, బాల ముకుందం, రెడ్డి సంఘము జిల్లా అధ్యక్షులు కోప్పెర వెంకట్ రెడ్డి, సురేష్, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు

## ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి

- సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలి
- అర్హత కలిగిన ప్రతి పౌరుడు సర్ ప్రక్రియలో భాగస్వామి కావాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 02, :** భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్నందున, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించు కోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సర్ షెడ్యూల్‌లో భాగంగా 2026 ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్దేశిత గడువులోగా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు గడువు సెప్టెంబర్ 16 వరకు ఉందని తెలిపారు. అర్హత కలిగిన పౌరులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలకు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సంబంధిత ఈఆర్ఓ వద్ద నిర్దేశిత విధానంలో సమర్పించ వచ్చని పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాల జాబితాలను ప్రజల సమాచారార్థం అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఈఆర్ఓలు ఈ జాబితాలను వారానికి ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేస్తారని పేర్కొన్నారు. జాబితాలో చేర్చిన ఏదైనా క్లెయిమ్‌పై అభ్యంతరం ఉన్న పౌరులు నిర్దేశిత విధానాన్ని అనుసరించి సంబంధిత ఈఆర్ఓను సంప్రదించవచ్చని తెలిపారు. క్లెయిమ్ లేదా అభ్యంతరంపై సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తీసుకున్న నిర్ణయంపై సంతృప్తి చెందనివారు మొదటి అప్పీల్ అధికారిగా జిల్లా మేజిస్ట్రేట్ కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా, మొదటి అప్పీల్ అధికారి ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తి చెందని వారు రెండవ అప్పీల్ అధికారిగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సీఈఓకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. సర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి చేరేలా ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన చోట క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలను నిర్దేశిత గడువులోగా దాఖలు చేసుకుని సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.



# పాత్రికేయ కురువృద్ధులు నందూరి

## నేడు నందూరి రామమోహనరావు వర్ధంతి

తెలుగు పత్రికలతో పరిచయం ఉన్న వారికి నందూరి రామమోహనరావు పేరు సుపరిచితమే. అయన సమాజం పట్ల నిబద్ధత కలిగిన సంపాదకులు. ఆయన ఎంతో మందికి గురు తుల్యులు, మార్గ నిర్దేశకులు. మరెంతో మందిని పాత్రికేయులుగా తీర్చి దిద్దిన గురువులు. పాత్రికేయునిగానే కాక, రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు. పత్రికారంగంలో అంతటి సంగీత సాహిత్య కళా మర్మాలెరిగిన వ్యక్తి చాలా అరుదు.

నందూరి రామమోహనరావు (ఏప్రిల్ 24, 1927- సెప్టెంబర్ 3, 2011) తెలుగు పాత్రికేయరంగ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేధావి. చాలాకాలం ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహించారు. "బాల" అనే పత్రికలో, ఆంధ్రపత్రిక లోనూ 1940 వ దశకంలో అయన రచనలు ఎన్నో ప్రచురింప బడ్డాయి. "నరావతారం", "విశ్వరూపం" ఆయన ప్రముఖ రచనలు. సామాన్య జనాలకు సైన్సు విషయాలను పరిచయం చేయడంలో నందూరి కృషి మరవ లేనిది. అయన ఆంధ్రపత్రికలో మార్క్ ట్వేయిన్ నవలలకు తెలుగు అనువాదాలు కూడా చేసారు. దశాబ్దాల క్రితం నందూరి ఆంధ్రవార పత్రికలో పిల్లల కోసం రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ కాంచన ద్వీపం, మార్క్ ట్వేన్ టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్, రాజూ పేద, విచిత్ర వ్యక్తి అనువాద రచనలు ఆకట్టుకునేవి. అనువాదం కూడా మరో భాష నుంచి అనువాదాన్ని చేసినట్లు కాకుండా తెలుగులో అచ్చు స్వీయ రచనలానే వుండేది.

ఆంధ్రపత్రిక ద్వారా ఆయన జర్నలిస్టు జీవితం ప్రారంభించి, 1948 నుంచి 1960 వరకు ఆయన ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1960లో సహ సంపాదకులుగా 'ఆంధ్రజ్యోతి'లో కాలూనారు. 1960 నుంచి 1994 దాకా...దాదాపు మూడున్నర దశాబ్దలు ఆయన 'ఆంధ్రజ్యోతి'లో రచనా జైత్ర యాత్ర కొనసాగించారు. ఆయన సంపాదకీయ రచనా వైశిష్ట్యం పాఠకులపై చాలా ప్రభావం చూపేది. తొలినాళ్లలో సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావుతో కలసి పని చేశారు. నార్ల తర్వాత 1980 లో నందూరి 'ఆంధ్రజ్యోతి' సంపాదకులుగా పూర్తిస్థాయి బాధ్యతలు భుజ స్కందాలపై వేసు కున్నారు. ఆయన 1962, 1978, 1984, 1992 లలో అమెరికాలో, 1982లో రష్యా లోను పర్యటించారు. ఆరు దశాబ్దాల కాలం గడిచినా, నందూరి నాటి పుస్తకాలకు ఆదరణ తగ్గక పోవడం విశేషం. నందూరి ఖగోళ, భౌతిక శాస్త్రాలను పరిశోధించి 'విశ్వరూపం' అనే పుస్తకం రచించారు. మానవాళి పరిణామ క్రమానికి సంబంధించిన నరావతారం, తత్త్వశాస్త్రాన్ని సులువుగా వివరించే 'విశ్వ దర్శనం' ఆయన కలం నుంచి జాలువారినవే. నందూరి.. సవ్యసాచి పేరుతో రాజకీయ వ్యంగ్య రచనలు, హరివిల్లు పేరుతో బాల గేయాలు, ఉషస్విని పేరిట కవితలు రచించారు. మిత్రలాభం, మిత్ర భేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నందూరి మాటలను అందించారు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మతో కలిసి 'మహా సంకల్పం' అనే సంకలనాన్ని వెలువరించారు. సంపాదకీయాల సంకలనం అను పల్లవి, చిరంజీవులు, వ్యాఖ్యావళి తదితరాలు ఆయన కలం నుండి జాలువారిన రచనలే. నందూరి రాసిన ఐదు పుస్తకాలను న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ అధినేత బాబ్జీ ప్రచురించి 2006 మే 9వ తేదీన ప్రముఖుల సమక్షంల ఆవిష్కరించి, ఆయనను సత్కరించారు.

ఆంధ్రపత్రికలో పని చేసే రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, తెన్నేటి సూరి, పిలకా గణపతిశాస్త్రి వంటి దిగ్గజాలతో సాహిత్యంపై చర్చించేవారు. అలాగే ఆరుద్ర, శ్రీశ్రీ లతోపాటు 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు రామచంద్రమూర్తి, తదితరులతో నందూరికి సంబంధం, అనుబంధం ఉండేది. నరావతారం, విశ్వరూపం, విశ్వదర్శనం - భారతీయ చింతన విశ్వదర్శనం - పాశ్చాత్య చింతన అనుపల్లవి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) చిరంజీవులు (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), వ్యాసావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) అక్షరయాత్ర (సాహిత్య, సాహిత్యేతర వ్యాస సప్తతి), ఉషస్విని (కవితా సంపుటి) చిలక చెప్పిన రహస్యం (పిల్లల నవల), మయూర కన్య (పిల్లల నవల), హరివిల్లు (పిల్లల గేయాలు) వంటి రచనలు చేసారు. అభినందన (హైదరాబాదు) సంస్థ నుంచి ముట్నూరి కృష్ణారావు అవార్డు (1988), జూలూరి నాగ రాజారావు (హైదరాబాదు) స్మారక అవార్డు (1989), మద్రాసు తెలుగు అకాడెమీ "ఉగాది వెలుగు" అవార్డు (1989), కళాసాగర్ (మద్రాసు) అవార్డు, అభిరుచి (ఒంగోలు) సంస్థ వారి "పాత్రికేయ రత్న" అవార్డు, . "జమీన్ రైతు" వజ్రోత్సవంలో నెల్లూరి వెంకట్రామా నాయుడు స్మారక అవార్డు (1990), ఆలూరి నారాయణరావు స్మారక ట్రస్టు (విజయవాడ) వారి సి.వై.చింతామణి అవార్డు, తెలుగు యూనివర్సిటీ వారి ఆనరరీ డాక్టరేట్ (1991), అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి "శిరోమణి" అవార్డు (1992), క్రాంతి విద్యా సంస్థల (విజయ వాడ) నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1994), రామకృష్ణ జైదయాళ్ హార్మొనీ అవార్డు (1994), సిద్ధార్థ కళా పీఠం (విజయవాడ) వారి విశిష్ట వ్యక్తి అవార్డు (1994), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1996), తెలుగు యూనివర్సిటీ వారి తాపీ ధర్మారావు స్మారక అవార్డు (1997), అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు (1998), తదితర అవార్డులు అందుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మూసీ తీరాన తొలి ఉద్యోగ పోరాటం

### ఉనికి కోసం విద్యార్థి సమరం: 1952 నాటి చారిత్రక రక్తతర్పణం

### ముల్కీ నినాదం - అమరుల ప్రయాణం: తెలంగాణ హక్కుల పోరాటానికి తొలి సంతకం




తెలంగాణ ఆధునిక ప్రజా పోరాటాల చరిత్రలో 1952 సెప్టెంబర్ 3వ తేదీ ఒక నెత్తుటి మైలురాయిగా, కన్నతల్లి వంటి మాతృభూమి హక్కుల పరిరక్షణకు నవతరం సాగించిన తొలి పెను నిప్పురవ్వగా సువర్ణాక్షరాలతో లిఖించ బడింది. కాకతీయుల శౌర్య పరాక్రమాలు, పోతన భక్తిరస మాధుర్యం, ప్రజాకవుల విప్లవ వీచికలు పురివిప్పిన ఈ పుణ్యభూమిపై స్వాతంత్ర్యపు తొలి పొద్దుల్లోనే స్థానిక యువత తమ ఉనికి, ఆత్మగౌరవం, ఉపాధి హక్కుల కోసం నెత్తురోడుతూ వీధుల్లోకి రావాల్సి రావడం ఒక తీరని చారిత్రక విషాదం. 'ముల్క్' అనే ఉర్దూ పదానికి ప్రాంతం లేదా స్వదేశం అనే అర్థం ఉండగా, తరతరాలుగా ఈ మట్టి వాసనను గుండెల్లో నింపుకొని జీవనం సాగిస్తున్న స్థానిక బిడ్డలను గౌరవప్రదంగా 'ముల్కీలు'గా వ్యవహరించారు. నిజాం నవాబుల పరిపాలనా కాలంలోనే, ప్రధానంగా 1919లో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ జారీ చేసిన చారిత్రక ఫర్మానా ద్వారా 'హైదరాబాద్ సివిల్ సర్వీస్ రెగ్యులేషన్స్' కింద ముల్కీ నిబంధనలు రూపుదిద్దుకున్నాయి. పుట్టుకతో సంస్థానంలో స్థిరపడినవారు లేదా కనీసం పదిహేనేళ్లపాటు వరుసగా ఇక్కడే నివసించినవారికే స్థానిక కొలువుల్లో పట్టం కట్టాలన్నది ఆ రాజశాసనం యొక్క మూల సిద్ధాంతం. అయితే, 1948 సెప్టెంబరులో ఆపరేషన్ పోలో పేరిట సాగిన సైనిక చర్య ద్వారా హైదరాబాద్ రాజ్యం భారత యూనియన్‌లో విలీనమై, 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన అనంతరం ఈ చట్టబద్ధ రక్షణలకు నిర్దాక్షిణ్యంగా పాతర వేసే ప్రక్రియ పరిపాలనా వర్గాల్లో అంతర్గతంగా వేగవంతమైంది. పరిపాలనా సంస్కరణల పేరిట, స్థానిక భాషా నెపంతో ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో స్థానికేతరులను ప్రభుత్వ సర్వీసుల్లోకి దొడ్డిదారిన నియమించడం స్థానిక విద్యావంతుల గుండెల్లో అంతులేని అసంతృప్తిని, భవిష్యత్ అభద్రతాభావాన్ని, కణకణ మండే అగ్నిపర్వతాలను రగిల్చింది. తమ నేలమీద తమకే గుర్తింపు కరువవుతున్న వేళ, కడుపుమండిన యువతరం అంతరంగంలో రగిలిన ఆత్మఘోష ఒక మహోద్యమానికి నాంది పలికింది.

ఈ అంతర్గత ఆవేదనకు 1952 జూన్-జూలై మాసాల్లో చారిత్రక వరంగల్ పట్టణంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల ఉదంతం తీవ్ర ఉత్ప్రేరకంగా మారి ఉద్యమ దావానలాన్ని రగిలించింది. స్థానిక ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా పక్కనపెట్టి, దాదాపు 180 మందికి పైగా స్థానికేతరులను డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ద్వారా అక్రమంగా నియమించడంతో వరంగల్ వేదికగా విద్యార్థుల గళం కారుమబ్బులా గర్జించింది. 'నాన్-ముల్కీ గో బ్యాక్', 'ఇడ్లీ-సాంబార్ వాపస్ జావో' అనే నినాదాలు ప్రళయఘోషలా మిన్నంటి, వరంగల్, హన్మకొండలలో పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలు క్రమంగా ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మెదక్ జిల్లాల మీదుగా రాజధాని హైదరాబాద్ నగరానికి శరవేగంగా విస్తరించాయి. ఆగస్టు 29న హన్మకొండ హైస్కూల్ వద్ద శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచార్జి వార్త హైదరాబాద్ చేరడంతో ఉద్యమం పారే సెలయేరులా ఉరకలెత్తి విస్తరించింది. విద్యార్థి లోకం సమరశంఖం పూరిస్తూ ఆగస్టు 30న సంపూర్ణ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది. సైఫాబాద్ సైన్స్ కళాశాల, చాదర్‌ఘాట్, నిజాం కాలేజీ, సిటీ కాలేజీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉద్యమ రణక్షేత్రాలుగా మారాయి. సెప్టెంబర్ 1న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శివకుమార్‌లాల్ విద్యార్థులను అణచివేయడానికి బహిరంగ హెచ్చరికలు జారీ చేసినా, ఉప్పొంగిన ఆత్మగౌరవ సంకల్పం ముందు అవి ఏమాత్రం నిలువలేకపోయాయి. సెప్టెంబర్ 2 నాటికి భాగ్యనగరం మొత్తం నిరసన ప్రదర్శనలు, ర్యాలీలతో కల్లోల సముద్రంలా దద్దరిల్లగా, ఆందోళనలను కట్టడి చేసే దురుద్దేశంతో సెప్టెంబర్ 3న పోలీస్ కమిషనర్ హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ లోని 22వ సెక్షన్ కింద సభలు, సమావేశాలు, ఊరేగింపులపై తీవ్రమైన నిషేధాజ్ఞలు అమలు చేశారు.

సెప్టెంబర్ 3 ఉదయాన నయాపూల్ సమీపంలోని సిటీ కాలేజీ విద్యార్థి సముద్రమై పొంగిపొర్లింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌లాల్ నిషేధాజ్ఞల గురించి మైకుల్లో విన్నవించినప్పటికీ, తమ న్యాయమైన ఉద్యోగ హక్కులను తాకట్టు పెట్టేది లేదని భీష్మించిన వేలాది మంది యువకిశోరాలు తరగతి గదులను దాటి రాజవీధుల్లోకి కదం తొక్కారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు కొందరు రంగప్రవేశం చేసి సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినప్పటికీ, పోలీసుల మొండి వైఖరి, దుందుడుకు చర్యలు వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేశాయి. విద్యార్థులపై విచక్షణారహితంగా బాష్పవాయు గోళాలను ప్రయోగించి, లాఠీల విన్యాసం చేయడంతో ఆ ప్రాంతం యుద్ధభూమిగా మారింది. ఆత్మరక్షణ కోసం విద్యార్థులు, వారికి మద్దతుగా తరలివచ్చిన సాధారణ పౌరులు రాళ్లు రువ్వడంతో పోలీసులు ఏకపక్షంగా తుపాకులకు పనిచెప్పారు. కన్నతల్లి మూసీ నది సాక్షిగా సిటీ కాలేజీ ప్రధాన ద్వారాల వద్ద, పత్తర్‌ఘాట్, మదీనా కూడళ్ల వీధుల్లో తూటాలు పేలడంతో పసిప్రాయపు నెత్తురు ఏరులై పారింది. మహమ్మద్ ఖాసిం, షేక్ మహబూబ్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే పోలీసు తూటాలకు బలవుతూ నేలకొరిగి అమరవీరులవగా, తీవ్రంగా గాయపడిన జమాలుద్దీన్, రాములు ఉస్మానియా ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ దారుణ కాల్పుల పర్వంలో విద్యార్థులు, పోలీసులు, అమాయక బాటసారులతో కలిపి దాదాపు 147 మంది తీవ్ర క్షతగాత్రులయ్యారు. మరుసటి రోజు సెప్టెంబర్ 4న కూడా పోలీసు కాల్పుల్లో మరణించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేశారనే తీవ్ర ఆగ్రహంతో అఫ్జల్‌గంజ్, ఉస్మానియా ఆసుపత్రి పరిసరాల్లో ప్రజలు కట్టలు తెంచుకున్న ప్రవాహంలా తిరగబడ్డారు. ఆ క్రమంలో చోటుచేసుకున్న ఘర్షణల్లో పోలీసులు మరోమారు కాల్పులు జరపడంతో గంగాపురం శంకర్, లక్ష్మీనారాయణ, నరసింహులు, మీర్జా అలీ మహమ్మద్ షఫీ వంటి అమాయకులు ప్రాణాలు కోల్పోయి నేలకొరిగారు.

ఈ నెత్తుటి ఘటనల తీవ్రతకు, ప్రజా తిరుగుబాటుకు అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు నేతృత్వంలోని ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు సెప్టెంబర్ 5న హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పింగళి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏకసభ్య విచారణ కమిషన్‌ను నియమించింది. దాదాపు వంద మంది సాక్షులను, అధికారులను విచారించిన పింగళి జగన్మోహన్‌రెడ్డి కమిషన్, డిసెంబర్ 28న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పోలీసు ఉన్నతాధికారుల అనాలోచిత తీరును, సమన్వయ లోపాన్ని, నిరాయుధులైన విద్యార్థులపై మితిమీరిన బలప్రయోగాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. అదే సమయంలో ముల్కీ నిబంధనల పరిశీలనకు, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 7న నలుగురు మంత్రులతో కూడిన అత్యున్నత మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. ఈ కేబినెట్ ఉపసంఘంలో అప్పటి ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి డాక్టర్ బూర్గుల గోపాలరావు (జి.ఎస్. మెల్కోటే), విద్యాశాఖ మంత్రి ఫూల్‌చంద్ గాంధీ, వ్యవసాయ శాఖ మంత్రి నవాబ్ మెహదీ నవాజ్ జంగ్, పునరావాస మరియు స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి కొండా వెంకట రంగారెడ్డి (కె.వి. రంగారెడ్డి) సభ్యులుగా వ్యవహరించి స్థానిక ఉద్యోగ రక్షణలపై విస్తృత పరిశీలన జరిపారు.

1952 నాటి ఈ సిటీ కాలేజీ నెత్తుటి అధ్యాయం కేవలం ఒక తాత్కాలిక విద్యార్థి నిరసన మాత్రమే కాదు; అది ప్రాంతీయ వనరులు, అవకాశాలు, ఉద్యోగాలపై స్థానికులకే సంపూర్ణ సార్వభౌమాధికారం ఉండాలనే చైతన్యానికి నూతన భావజాలాన్ని అందించిన తొలి రాజకీయ గర్జన. 1969 నాటి చారిత్రక తొలిదశ జై తెలంగాణ ఉద్యమానికి, తదనంతర కాలంలో దశాబ్దాల పాటు సాగి చివరకు స్వరాష్ట్ర కల సాకారమైన మలిదశ ప్రత్యేక రాష్ట్ర సాధనా ప్రస్థానానికి దిక్సూచిగా నిలిచిన 'తెలంగాణ స్థానిక అస్తిత్వ ఆత్మఘోష' ఈ రక్తతర్పణంలోనే మొలకెత్తింది. ఆనాడు సిటీ కాలేజీ ముంగిట నేలరాలిన అమరుల త్యాగాలు, ఆ ప్రాంగణంలో చిందిన ప్రతి రక్తపు బొట్టు పారే సెలయేటి స్వచ్ఛతతో, మ్రోగే పాంచజన్యపు నాదంతో తెలంగాణ సమాజంలో ఆత్మగౌరవ జ్యోతిగా మారి, భావితరాల హక్కుల పోరాటాలకు ఎప్పటికీ చెరిగిపోని నిత్య స్ఫూర్తిగా, సజీవ ప్రతీకగా నిలిచింది. ఈ పోరాట చైతన్యం కేవలం గత కాలపు జ్ఞాపకం కాదు; స్వపరిపాలన, ఆత్మగౌరవం, స్వావలంబనల ప్రాధాన్యతను నిత్యం గుర్తుచేసే ఒక నిరంతర ఆత్మప్రబోధం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# టాస్ వేయడానికే రోజంతా పడుతుంది

## పాక్‌ను ట్రోల్ చేసిన పీటర్సన్!



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. మూడో టెస్టుకు ముందే మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘాలతో సహా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపివేస్తూ పీసీబీ తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను ఇంటికి పంపి వారి స్థానంలో ఐదుగురు అరంగేట్రం చేయని కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు, మాజీ క్రికెటర్లు పెద్ద ఎత్తున వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఈ పరిణామాలపై ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ తనదైన శైలిలో స్పందించాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌పై హాస్యభరితమైన కామెంట్లు చేశారు. "ప్రతి మ్యాచ్‌కి ముందు జరిగే విలేకరుల సమావేశంలో జట్లలో జరిగిన మార్పుల గురించి వ్యాఖ్యాతలు కెప్టెన్లను అడుగుతారు. ఇప్పుడు నా ఫ్రెండ్ బాబర్‌కు అది చాలా సుదీర్ఘమైన సమావేశం కానుంది. ఈ లెక్కన టాస్ వేసే ఘట్టం మ్యాచ్‌కి ఒక రోజు ముందే ప్రారంభించాలేమో" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా కూడా తన సొంత క్రికెట్ బోర్డుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. "క్రికెట్ చరిత్రలో సిరీస్ మధ్యలో ఒక జట్టు ఇలా ఏడుగురు ఆటగాళ్లను, కోచ్‌లను మార్చడం నేను ఎప్పుడూ చూడలేదు. పాకిస్థాన్ నిజంగా ఒక కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లా ఉంది.. సీజన్ మధ్యలోనే మేనేజర్‌ను తీసేసినట్లు చేస్తున్నారు. మరో పది రోజులు ఆగి సిరీస్ ముగిసాక ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అని రమీజ్ రజా పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు ముందు పాక్ జట్టులో మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, అరాఫత్ మిన్హాస్, ఇమ్రాన్ రంధావా వంటి ఐదుగురు అన్ క్యాప్డ్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. వీరికి తోడు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి వారి స్థానంలో మైక్ హెస్సన్, యాష్లే నాఫ్కేలను నియమించారు. ఎన్నో వివాదాలు, ట్రోల్స్ మధ్య సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఆఖరి టెస్టులో బాబర్ సేన ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

# ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరం

కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్

దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్



భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

# పాక్ క్రికెట్‌ను కుదిపేస్తున్న వివాదాలు





ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ జట్టులో చోటుచేసుకున్న ఊహించని మార్పుల సంచలనం చల్లారకముందే పీసీబీకి మరో పెద్ద షాక్ తగిలింది. పాకిస్థాన్ క్రికెట్ సెలక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్న ఆ జట్టు మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ .. తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ చేతిలో 194 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన తర్వాత పీసీబీ తీసుకున్న నిర్ణయాలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ క్రమంలోనే మిస్బా బోర్డుకు తన నిర్ణయాన్ని వెల్లడించాడు. మూడో టెస్టుకు ముందు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా వంటి ఏడుగురు ప్రధాన ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించడం, అలాగే ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తొలగించడం వంటి నిర్ణయాల్లో మిస్బాను బోర్డు సంప్రదించలేదని తెలుస్తోంది. జాతీయ ఎంపిక కమిటీలో కీలక సభ్యుడిగా ఉన్నప్పటికీ, తన అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై అతడు తీవ్ర అసంతృప్తి చెందాడు. ఈ క్రమంలోనే సెలెక్టర్ పదవితో పాటు లాహోర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీ బ్యాటింగ్ కన్సల్టెంట్ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్ 0-2తో చేజారడం, మూడో టెస్టులో ఘోర పరాభవం నుంచి తప్పించుకునేందుకు పీసీబీ ఏకంగా ఐదుగురు సరికొత్త అన్ క్యాప్డ్ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, మహమ్మద్ ఇమ్రాన్ రంధావా, రాజావుల్లా వంటి యువ ఆటగాళ్లను జట్టులో చేర్చింది. పరిమిత ఓవర్ల జట్టు కోచ్‌గా ఉన్న మైక్ హెస్సన్‌ను టెస్ట్ జట్టుకు కూడా హెడ్ కోచ్‌గా నియమించింది. అయితే గత 20 టెస్టుల్లో 15 ఓటములతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న పాకిస్థాన్ జట్టులో ఈ మార్పులు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో మిస్బా ఉల్ హక్ చాలా ఏళ్లుగా భాగంగా ఉన్నాడు. 2019లో అతడు ఒకే సమయంలో హెడ్ కోచ్, చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత 2020లో చీఫ్ సెలెక్టర్ పదవికి, 2021లో హెడ్ కోచ్ బాధ్యతలకు స్వస్తి చెప్పాడు. తిరిగి 2023లో సలహాదారుగా, 2024 మార్చిలో నాలుగో సభ్యుడిగా సెలక్షన్ కమిటీలో చేరాడు. ఇటీవల ముల్తాన్‌లో జరిగిన జాతీయ ఛాంపియన్స్ కప్‌లో పాకిస్థాన్ గోల్డ్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించి విజేతగా నిలిపారు. కానీ ప్రస్తుత సంక్షోభ పరిణామాల నేపథ్యంలో మిస్బా.. పీసీబీకి పూర్తిగా దూరమయ్యాడు.





# తేలిపోనున్న రోహిత్ భవితవ్యం

## బీసీసీఐ కీలక సమావేశం

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అత్యున్నత స్థాయి సమావేశానికి సిద్ధమైంది. గురువారం ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో ఈ మీటింగ్ నిర్వహించనుంది. ఈ సమావేశానికి సంబంధించిన ఎజెండాను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఐర్లాండ్, ఇంగ్లండ్, శ్రీలంక పర్యటనల్లో భారత జట్టు ప్రదర్శనపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ హాజరుకానున్నారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వర్చువల్‌గా పాల్గొననున్నాడు. సీసీ టీ20 ప్రపంచ కప్ విజయానంతరం.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ జట్టు దారుణంగా విఫలమైంది. వరుసగా 6 టీ20 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించలేకపోయింది. ఈ ఫలితాలపై బీసీసీఐ అప్పట్లోనే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వైఫల్యాలపై ఖచ్చితంగా సమీక్ష చేస్తామని సెక్రటరీ దేవజిత్ సైకియా అప్పట్లోనే మీడియాకు తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల ఈ సమావేశం ఇప్పటి వరకు జరగలేదు. భారత జట్టు ప్రదర్శనతో పాటు భవిష్యత్తు ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ భవితవ్యంపై బీసీసీఐ, సెలెక్షన్ కమిటీల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. వన్డే ప్రపంచకప్ 2027 వనకు రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం కష్టమని వార్తలు వచ్చాయి. రోహిత్ రిటైర్మెంట్ అంటూ కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తలను బీసీసీఐ ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ భవితవ్యంపై కూడా ఈ సమావేశంలో చర్చించినున్నట్లు తెలుస్తోంది. జట్టులో కొనసాగించాలా? వద్దా? అనేదానిపై బీసీసీఐ, మేనేజ్‌మెంట్ ఏకాభిప్రాయానికి రానుంది. ఈ సమావేశం అనంతరం రోహిత్ భవితవ్యంపై స్పష్టత రానుంది. అప్‌కమింగ్ న్యూజిలాండ్ పర్యటనలో అనుసరించాల్సి వ్యూహాలపై కూడా చర్చ జరగనుంది. అంతేకాకుండా జట్టు వేధిస్తున్న ఆటగాళ్ల గాయాల బెడద గురించి సుదీర్ఘంగా చర్చింనున్నారు. ముఖ్యంగా సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌ను వివరణ కోరనున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడగింపుతో పాటు, భారత జట్టు నిర్వహణలో వీవీఎస్ లక్ష్మణ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించే అంశంపై కూడా చర్చలు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్ 18న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కంటే ముందే ఈ ఉన్నత స్థాయి భేటీ జరుగుతుండటంతో.. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు భారత క్రికెట్ భవిష్యత్తును నిర్దేశిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పవన్‌కు ప్రత్యే ఫోటోతో బన్నీ శుభాకాంక్షలు






ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కెరీర్ ఆరంభం నాటి క్లాసిక్, స్టైలిష్ లుక్‌తో కూడిన ఒక వింటేజ్ పోస్టర్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. 90ల నాటి సినిమా స్టిల్లా అన్నట్లుగా ఉన్న ఈ క్రేజీ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో పవన్ కల్యాణ్ ఒత్తుగా ఉన్న కర్లీ హెయిర్, షార్ప్ లుక్ మరియు బ్లాక్ టీ-షర్ట్‌తో సరికొత్త స్టైలిష్ వైబ్స్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన ట్రిబ్యూట్ పోస్టర్ ద్వారా అల్లు అర్జున్ తన బాబాయ్ పవన్ కల్యాణ్‌పై ఉన్న ప్రేమను, అభిమానాన్ని చాటుకున్నారు. మెగా అభిమానులు సైతం ఈ ఫొటోను సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ చేస్తూ పవన్‌కు బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు.

# రజనీ అభిమానులకు పండగ

## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల



సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ వి షయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడిన్లటైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.






# ఓటీటీలోకి పళ్ల బురుసు

సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ ప్లలెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.

# కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.





## సంకల్ప సాధకుడు పవన్

### తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, ప్రజలందరూ మెచ్చే నాయకుడిగా తన లక్ష్యాలను సాధించాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ 'ఇట్లు మీ అన్నయ్య చిరంజీవి' అంటూ ఆప్యాయంగా బర్త్‌డే విషెస్ అందజేశారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com